
Saraswata Niketana
VETAPALEM.



## శ్రీ రావినూతల రామమూర్తి పంతులు

నాకు పిచ్చి అని జిల్లా సర్జను ఎందుకు నిర్ణయించి నాడు అని అడుగుతున్నారా ? అయితే చెపుతాను వినండి.—

నేను చిన్నతనంలో మహాకష్టం మీద చదువు కొన్నాను. మా తల్లిదండ్రులు అయితే నేం, మా పంతు లయితే నేం, పది రూపాయలు నన్ను కొట్టిన బెత్తాలకింద ఖర్చు పెట్టి వుంటారు. నన్ను మావాళ్లూ- మా అయ్య వారూ, యింకా యితరులు వూళ్లో వాళ్లూ అప్పుడప్పుడు ప్రసాదించిన దెబ్బల వల్ల ఏర్పడిన గాయాల మచ్చలు యింతవరకూ మావూళ్లో పుట్టిన వాళ్లలో ఎంచడానికి ప్రయత్నించని వాడూ మొదలు పెట్టిన తర్వాత ఓపిక పట్టి ఎంచినవాడూ లేనే లేడు. నమ్మితే నమ్మండి లేకుంటే లేదు. కాని నాకు పదహారేళ్లు వచ్చేసరికి భగీరథ ప్రయత్నంతో ఎట్లాగో దస్కతు చేయడం మాత్రం నేర్చుకొన్నాను. నిజం చెప్పవలసివస్తే యిప్పటికయినా సాధారణంగా నేను ఒకసారి చేవ్రాలు చేసిన కలం మరొకమాటు వ్రాయడానికి-యితరుల సంగతి అలావుంచి- నాకయినా పనికిరాదు. అయితే మావూళ్లో నేను చదువు వున్న వాణ్ణిగానే చెలామణీ అవుతున్నాను. అందుకు కారణము లేకపోలేదు.

బ్రాహ్మణజన్మ గనుక చదువు రాదంటే పరువు దక్కదు చదువురాదని ఎవరూ అనుమాన పడకుండా వుండడానికి మావూళ్లో వ్రాసుకొనే ప్రామిసరి నోట్ల లోనూ, విక్రయదస్తావేజుల లోనూ, కవుళ్లలోనూ, కబోలియతులలోనూ, కడవు రసీదులలోనూ, మొదటిసాక్షిగా చేవ్రాలు చేస్తూ వుండేవాణ్ణి. కొన్నాళ్లకు నేనూ చదువు కొన్నవాళ్ల దర్జాలో చేరినందుకు మురిసిపోతూ వుండే వాణ్ణి.

కర్మం చాలలేదు. గ్రహాలు వక్రించినవి. జనాభా రెుత్తేసమయం వచ్చింది. లెక్కలు తయారు చేయడానికి అధికారులు నన్ను మావూళ్లో మాలపల్లెకు ఎన్యూమరేటరుగా నియమించి నారు. ఉత్తరువు చూసేసరికి నా గుండె గుభేలుమంది. ఏమీ తోచలేదు. కాని ఏం ప్రయోజనం? ఒప్పుకుంటినా-లెక్కలు వ్రాయడంములో తప్పులు పోతే గవర్నమెంటువారు దండిస్తారేమో- బహిరంగంగా నాకు చదువు రాదని చెప్పుకొందామా అంటే ఇన్నాళ్లూ చదుకొన్నవాణ్ణి అనే గౌరవంతో బతికిన వాణ్ణి నలుగురిలోనూ అవమానం పాలుకావలసి వస్తుందేమో_పోనీ రహస్యంగా వెళ్లి అధికార్లకు వున్న సంగతి చెప్పుకుంటే నమ్ముతారో నమ్మరో_ యిట్లాంటి వూహాలు- వూహాలపయిన వూహాలు తరంగాలవలె మనస్సులో పరుగెత్తినవి. కాని పర్యవసానం తేలింది కాదు. శిక్షాభయమూ అవమాన దుఃఖమూ తప్ప నా మనోదృష్టికి మరేమీ గోచరించ లేదు. కడకు గుండె రాయిచేసుకొని ఎలా అయితే అలా అవుతుంది, నమ్మితే నమ్ముతాడు_ లేకపోతే లేదు చేతనయినంత వరకూ చెప్పి చూద్దాము అని తీర్మానించుకొన్నాను.

అప్పుడే బయలు దేరి తాలూకా సూపర్వైజరు గారి సమ్ముఖానికి వెళ్లాను. సూపర్వైజరు హాటూ, కోటూ, బూట్లతో కూర్చుని వున్నాడు. వాతో "ఏమిటయ్యా నీ గొడవ"? అన్నాడు.

"చిత్తం: చిత్తం. అభయదాతల ఆజ్ఞ"

"సరే కానియ్య వయ్యా- చప్పన- ఇప్పటికే అర్ధ గంటకు పయిన అయింది నీవు వచ్చి"

"బోడపాడుగ్రామం_ చిత్తగించారు..."

"ఆ! ఆ!"

"బ్రాహ్మణ జన్మం..."

"తెలుస్తూనే వుంది...ఆ సంగతి. అవతల కథ కానీయి"

"చిత్తగించండి, ఏం పాపం పూర్వ జన్మలో చేశానో కాని; నాకు సరిగ్గా చదువు అబ్బలే..."

"ఓహో! ఇదా! నీయొత్తూ! తెలిసింది. తెలిసింది. చదువుపేరు చెప్పుకొని..." అంటూ నిలబడివున్న నా



చేతులో ఒక రూపాయ బలవంతంగా వుంచి "ఇక నన్ను పీడించకు. నేను ఆఫీసుకు వెళ్లుతున్నా మరి వెళ్లు" అంటూ తటాలున తనచేతి ట్రంకుతో బయటికి వెళ్లడమూ, నేను ఏమీ తోచక వెర్రివాడి లాగా (Vacant) వేకంటు చూపులతో వూరుకోవడమూ కన్నుమూసి కన్ను తెరిచినంత సేపటిలో జరిగినవి.

నా బ్రాహ్మణవేషం కూడా నాకొంప తీయడానికి పూనుకొన్నది కాబోలు. ఇక వేషము మార్చడ మేలాగు సాధ్యమవుతుంది. ఆపయిన అసిష్టంటు తాలూకా సూపర్

వైజరుగారి దగ్గిర కెళ్లి సంగతి చెప్పాను. నామాట నమ్మక పోవడమలావుంచి "జనాభా లెక్కలు తయారు చేయడం తప్పించుకుందికి యీయెత్తు యెత్తావు. ఇది రాజద్రోహం. పయివాళ్లకు తెలిస్తే నీదుంప తెంపుతారు. తప్పకుండా డ్యూటి చేసి తీరాలి మారు మాట్లాడితివా నీ సంగతి పయివాళ్లకు తెల్పుతాను, జాగ్రత్త" అంటూ బెదిరించి తరిమి వేశాడు. ఏమి చిక్కు తెచ్చి పెట్టావురా భగవంతుడా అనుకొంటూ యిల్లు జేరాను.

సరే యింకేముంది. జనాభా లెక్కలు ఫలానా తేది మొదలు పెట్టాలంటూ సాటించారు. అందరితో పాటు నాకూ అచ్చు అయిన ఫారాలూ - ఒక రిజష్టరూ పంపారు. ఎలా అయితేనేం జనాభా లెక్కలు తయారు చేయడానికి నేను మొదలు పెట్టాను. ఏం చేయను విధి లేనప్పుడు! పని జరుగుతూంది. కాని నేను లౌక్యుణ్ణి కాక పోవడము చేత ఎన్యూమరేషనులో కొన్ని సందేహాలు వచ్చినవి. అందువల్ల పని సాగించడం మానివేసి పయి అధికారికి నాకు గలిగిన సందేహాలు తెలుపుతూ తన్నివృత్తి చెయ్యమని, మూడురోజులు రాత్రింబవళ్లూ కష్టపడి యీకింది అర్జీ తయారు చేసి పంపాను.

మహారాజ రాజశ్రీ

జనాభా సూపర్ వైజరుగారి దివ్యసన్నిధికి:—

బోడపాటి గ్రామం మాలపల్లె ఎన్యూమరేటరు పుల్లయ్య శాస్త్రి వ్రాసుకొన్న విజ్ఞాపనము

అయ్యా,

జనాభా లెక్కలు తయారు చెయ్యడానికి నేను అసమర్థుడనని తమకు ముందే మనవి చేసుకొన్నాను. ఎన్ని విధాల చెప్పినా నన్ను మీరీ వుద్యోగంలోనుంచి తొలగించినారు కారు. మీకు దయరాక పోవడం నాదురదృష్టం చేతనే అనుకుంటూను. నేను తమ వుత్తరువు మేరకు ఎన్యూమరేషను మొదలు పెట్టి చేయసాగినాను. కించిద్జ్ఞుడ నవడము చేత నాకీ విషయంలో కొన్ని సందేహాలు కలిగినవి. అందువల్ల ప్రస్తుతం పనిచేయడం మాని సందేహ నివారణార్థం తమకీ విజ్ఞాపనం చేసుకొంటున్నాను. నాకు వచ్చిన సందేహాలు యీదిగువ వుదహరిస్తున్నాను.

౧. నేను ఎంత చెడ్డా బ్రాహ్మణజన్మ యెత్తాను గదా! అలాటప్పుడు నా అలాట్‌మెంటులో వున్న మాలపల్లెకు ప్రతిదినమూ వెళ్లవలసి వస్తుంది గదా? కాబట్టి ప్రతినిత్యమూ జందెములు తీయవలెనా- లేక చిట్ట చివర్కి ప్రాయశ్చిత్తం చేయించుకొంటే చాలునా? ఈ సందర్భములో నాకయ్యే ఖర్చు ఎవరు భరించుకో వలసి వుంటుంది?

౨. సాధారణముగా మాలపల్లెలో కుక్కలు అధికంగా వుంటాయికదా! నేను అక్కడికి పొయ్యేటప్పుడు నన్ను కుక్కలు కరిచినట్లయితే- నాకు తగులు బడి అయ్యే మెడికలు ట్రీటుమెంటు ఖర్చులు బిల్లుచేసి తమవద్ద పుచ్చు కొనవలెనా, లేక నేనే భరించుకోవలసి వుంటుందా?

3. ఫయినల్‌డే నాడు ఎన్యూమరేషను చేయడంలో ఎవరేనా పెద్దమనిషి బోగందాని యింట్లో నయినా సారాయి దుకాణములో నయినా మనిఆఫ్ కూటములో నయినా వుంటే అతగాణ్ణి అక్కడ వున్నట్లు వ్రాయవలెనా- యింట్లో వున్నట్లు వ్రాయవలెనా?

౪. మా సూపర్‌వైజరుగారు యెక్కడికి రమ్మంటే అక్కడికి ఎన్యూమరేటర్లమయిన మేము వెళ్లవలెను గదా! ఒకవేళ ఆయన తానుంచుకొన్న దాని యింట్లో కూచొని అక్కడకు రమ్మంటే పోవలిసిందేనా? పోకపోతే రూల్సుకు వ్యతిరేకముగా నడుచుకొన్న వారము అవుతామా?

౫. ఫయినలుడే రాత్రి యెవడయినా ఒక మనిషి నేను ఫయినలు చెక్కింగ్ చేసిన తర్వాత చచ్చిపోయినాడు అనుకొందాము. అతడు చచ్చిపోయినట్టు వ్రాయవలెనా? బతికి వున్నట్టే వ్రాయవలెనా? బతికి వున్నట్టు వ్రాయడము అసందర్భము గదా? చచ్చిపోయినట్టు వ్రాయడానికి ఫయినలు చెక్కింగు అయిన తర్వాత చచ్చిపోయినాడు గదా?

౬. మావూళ్లో ఆకాశరామన్న అర్జీలు యిప్పించి- తప్పుడు సాక్ష్యములిచ్చి కలహాలలో రెండు పక్షాలనూ పితూరిలచేత వుసికొల్పి యిరువయిపులా డబ్బుతీసుకొని

జీవనము చేసేవారి వృత్తి అదే ప్రకారముగా యదార్థము వ్రాయవచ్చునా ? అట్లా వ్రాస్తేవాండ్లు పరువు నష్టము దావా తీసుకొని వస్తే అది చెల్లుతుందా ?

౭. గ్రామంలో కుంటెనగాండ్లు కొంతమంది డాఫర్లుగా వుంటారు కదా ! వారి సందర్భములో గూడా వృత్తి వ్రాయడములో చేయదగ్గ కార్యమేది ?

దయచేసి యీ సందేహాలకు తగిన జవాబులు వ్రాసి నాసందేహ నివృత్తి జేయవలెనని ప్రార్థిస్తున్నాను.

దివ్యచిత్తమునకు తేవలెను.

చిత్తగించవలెను ఇట్లు : తమవిధేయుడు
బోడపాటి మాలపల్లె ఎన్యూమరేటర్
పుల్లయ్యశాస్త్రి వ్రాలు

ఈ పిటీషను పోస్టుచేసిన నాల్గోనాటి ఉదయాన్నే యిద్దరు పోలీసువాళ్లు యమకింకరులు లాగా యింటి ముందర ప్రత్యక్ష మయినారు. వాళ్లను చూడగానే నా గుండెలు నీరయిపోయినవి ఇంకేముంది. కొంప మునిగింది. నాకు వారంటు. ఏంజేస్తాను. నాకర్మ మిట్లా కాలింది. చేసుకొన్నది అనుభవించక తీరుతుందా ? దుఃఖించి చేసే దేమున్నది.

ధైర్యము చిక్కబట్టి పోలీసుల వెంట బయలుదేరాను. తాలూకా మేజస్ట్రేటు "నీవు గవర్నమెంటును ధిక్కరించి రూల్సును పరిహాసం చేస్తావా ?" అన్నాడు.

"నాకు చదువురాదు బాబూ, నేనా సంగతి మొదటనే అధికార్లకు మనవి చేసుకుని వున్నాను. ఉద్యోగములో నుంచి తొలగించమని ఎంత వేడుకొన్నా విన్నారు కారు. బాబూ...ఏదో యీకాలం చట్టాలు తెలియని వాణ్ణి. నాకు తోచిన సందేహాలు వ్రాశాను. నేను మిమ్మలను పరిహాసం చేద్దామనే వుద్దేశం నాకు ఏకోశానా లేదు బాబూ ! ఎట్లా అయినా మన్నించండి. బీదవాణ్ణి" అంటూ ఎంతో వేడుకొన్నాను. నామొర వినిపించుకోకుండానే "నీకు చదువు రాదా...నీకు పిచ్చెత్తి వుండవలెను. నిన్ను జిల్లా సర్జన్ దగ్గిరకు పంపి పరీక్ష చేయించుతాను ?" అన్నాడు.

'కుయ్యో మొర్రో' అన్నా వినకుండా "టెంపొరరి యిన్‌శానిటి అంటే తాత్కాలి కోన్మాదము" అని జిల్లాసర్జన్ అన్నాడు. ఇందు కోసరము నన్ను విశాఖపట్నము పంపుతారుట. అమ్మా బాబో-చదువు వచ్చినట్టు నటించినందుకా యిదంతా !





భృంగామలకతైలము

మెదడుకి, శరీరానికి చలువదన మిచ్చును.

1 ఔన్సు మాదిరి బుడ్డి $2\frac{1}{2}$ అణాలు.

6 ఔన్సు బుడ్డి 12 అణాలు.

నంజనగూడు పండ్లపొడి

300 కృత్రిమర్థకాల్కకి మోసపోకండి. సరాసరి వొకే ఆర్డరివ్వండి 8 అ. 6 ప్యాకెట్టు. తపాలాచార్జి ఉచితము.

హోల్‌ఏజెంట్లు: యునైటెడ్ కన్సరన్, బందరువీధి, మద్రాసు.
కాకినాడ, సూర్యారావుపేట, లక్ష్మీనారాయణకంపెనీ,
రాజమండ్రి, అరవరామస్వామి అండ్‌సన్సు,
బందరు, ఆనందాఫార్మసీయందును దొరుకును.

# మన్మథ శాస్త్రము

ముఖ్యముగ అందరు చదువవలసినది

ఇందు, స్త్రీ పురుషజాతులు, ఏయేజాతిస్త్రీ యేయే పురుషునికి తగినది, స్త్రీని పురుషుడెట్లు వశపఱచుకొనుట—యింకను ఎన్నో స్త్రీ పురుషులకు ముఖ్యముగ తెలియవలసిన విషయములు ఉన్నవి. వెల 8 అణాలు.

దిఓరియంటల్ బుక్ డిపో
మద్రాసు